సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 29 । జూలై । 2023



సోమశిలలో 24.29 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారానికి 24.29 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 673 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,220
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,498
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,663
నవర (8 గ్రాములు)	రూ.45,304

గరిష్టం/కనిష్టం
35.7 /27.8

వాతావరణం

వాతావరణంలో తేమ 58 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పొడి వాతావరణం శనివారం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

స్పెషల్ పీపీగా రమణారెడ్డి



నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది దాట్ల రమణారెడ్డిని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. మత్తు మందులు, మాదక ద్రవ్యాల వినియోగ నిరోధక చట్టానికి సంబంధించిన కేసులను ప్రభుత్వం తరఫున నెల్లూరు మొదటి అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో వాదించనున్నారు. పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

నాబార్డు డీడీఎంకు సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నాబార్డు డీడీఎం రవిసింగ్‌ను డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు శుక్రవారం సత్కరించారు. గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీలో గల తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ మాట్లాడారు. 2023 – 24 సంవత్సరానికి గానూ నాబార్డు ప్రకటించిన అవార్డుల్లో నెల్లూరు డీసీసీబీకి రెండు అవార్డులు లభించాయని తెలిపారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నామని చెప్పారు. బ్యాంక్ జీఎంలు సరిత, ఉషారాణి, డీజీఎంలు దయాకర్‌రెడ్డి, నాగేంద్రకుమారి, మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదుకుంటున్న సీఎం



ఉద్యోగులను అభినందిస్తున్న రాజారెడ్డి

కావలి: ఆర్టీసీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా ఆదుకుంటున్నారని సంస్థ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు. కావలి డిపోను శుక్రవారం సందర్శించిన ఆయన డిపో అభివృద్ధిపై అధికారులు, ఉద్యోగులతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పన్నుల రూపంలో ఆర్టీసీని లూటీ చేయడమే కాకుండా రాయితీలు, బాకీలివ్వకుండా అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. ఇప్పటి వరకు రూ.2500 కోట్ల మేర అప్పులు తీర్చామని పేర్కొన్నారు. మరో 1500 కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నామని వెల్లడించారు. డీఎం రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ ఖాజామొహిద్దీన్, డిప్యూటీ సూపరింటెండెంట్ రమేష్‌బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్, కార్మిక నేతలు మస్తాన్, వెంకటేశ్వర్లు, కరీమ్, తదితరులు పాల్గొన్నారు.

463 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరు రూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో రైతుల నుంచి 463 బేళ్లను శుక్రవారం కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. 472 బేళ్లను తీసుకురాగా, వివిధ కారణాలతో తొమ్మిదింటిని తిరస్కరించామని చెప్పారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.270, అత్యల్ప ధర రూ.150, సగటు ధర రూ.249.55గా నమోదైందని వివరించారు.

31న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అండర్ – 13 బాలుర, బాలికలకు ఫుట్‌బాల్ పోటీలు, జట్ల ఎంపికలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 31న నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియానికి ఉదయం ఎనిమిది గంటలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 94407 42002, 99498 53865 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రదర్శనను నగరంలోని పురమందిరంలో ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహించనున్నామని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారాధికారి పరవస్తు నాగసాయిసూరి పేర్కొన్నారు. రొట్టెల పండగ నేపథ్యంలో ప్రభుత్వ పథకాలపై ప్రచార రథాన్ని నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ క్షేత్ర కార్యాలయం, నెల్లూరు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. జిల్లా యువజన సమన్వయకర్త మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

భక్తజన సంద్రమైన స్వర్ణాల చెరువు





విద్యుద్దీపాలతో శోభిల్లుతున్న బారాషహీద్ దర్గా

రొట్టెల పండగకు వేళాయె

నేటి నుంచి ఐదు రోజుల పాటు నిర్వహణ

- ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రూ.మూడు కోట్లతో నగరపాలక సంస్థ ఏర్పాట్లు

రొట్టెలు మార్చుకుంటూ..



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువులో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రొట్టెల పండగ శనివారం ప్రారంభం కానుంది. కార్యక్రమానికి రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండగకు దేశ, విదేశాల నుంచి భక్తులు రానున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా నగరపాలక సంస్థ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పండగ నిర్వహణకు దాదాపు రూ.మూడు కోట్లను కార్పొరేషన్ కేటాయించింది.

కోర్కెలు నెరవేరాలని కాంక్షిస్తూ..

బారాషహీదులను స్మరిస్తూ తమ కోర్కెలు నెరవేరాలని కాంక్షిస్తూ స్వర్ణాల చెరువులో రొట్టెలను భక్తులు మార్చుకుంటారు. కోర్కెలు తీరాక తిరిగి రొట్టెను వదులుతారు. పండగకు పది లక్షల నుంచి 12 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా.

షహీదులు కొలువైన చోటే..

మహ్మద్ ప్రవక్త సందేశాన్ని ప్రపంచవ్యాప్తం చేయడంలో భాగంగా 12 మంది మతబోధకులు టర్కీ నుంచి దేశానికి వచ్చారు. ఆ సమయంలో కొడవలూరు మండలంలోని గండవరంలో తమిళనాడు వాలజా రాజులు, బిజాపూర్ సుల్తాన్ల మధ్య పవిత్ర యుద్ధం జరిగింది. ఇందులో టర్కీ కమాండర్, మత ప్రచారకుడు జుల్ఫికర్‌బేగ్, మరో 11మంది వీర మరణం పొందారు. వారి తలలు గండవరంలో తెగిపడగా, వీరుల మొండేలను నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్దకు గుర్రాలు తీసుకొచ్చాయి. వీరమరణం పొందిన 12 మంది నెల్లూరు ఖ్వాజీకి కలలో కనపడి తమను అక్కడే సమాధి చేయాలని కోరారు. దీంతో అక్కడే సమాధులను నిర్మించారు. దీంతో వీరమరణం పొందిన ఈ 12 మంది జ్ఞాపకార్థం బారాషహీద్ అనే పేరొచ్చింది.

4908 మంది పారిశుధ్య కార్మికులు

బారాషహీద్ దర్గా ఆవరణ, స్వర్ణాల చెరువు, పార్కింగ్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేసేందుకు వీలుగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 4908 మంది కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించారు. రోజూ మూడు షిఫ్టుల్లో వీరు విధులు నిర్వర్తించనున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టారు.

భక్తులకు సౌకర్యాలు

రొట్టెల పండగలో ఎలాంటి హడావుడి, ఆర్భాటాల్లేకుండా ఘనంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో అవసరం లేకపోయినా ఆర్భాటంగా ఖర్చు చేసి కార్పొరేషన్ నిధులను నీళ్ల పాల్జేశారు. భక్తులకు సౌకర్యాలను మాత్రం విస్మరించారు.

అన్ని శాఖల సమన్వయంతో..

అన్ని శాఖల సమన్వయంతో రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహించేందుకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పనిచేస్తున్నారు. కలెక్టర్, ఎస్పీతో పాటు కమిషనర్‌తో సమావేశాలను ఇప్పటికే నిర్వహించారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఏడు జోన్లుగా దర్గా ఆవరణ

బారాషహీద్ దర్గా ఆవరణను ఏడు జోన్లుగా విభజించారు. మొదటి జోన్‌లో దుకాణాలు, పోలీస్ కంట్రోల్ రూమ్.. రెండో జోన్‌లో వాటర్ స్టాళ్లు, దుకాణాలు, మరుగుదొడ్లు, శానిటరీ కార్యాలయం ఉంటాయి. మూడో జోన్‌లో షెల్టర్లు, దుకాణాలు, ఆసిఫ్ హుస్సేన్ బాబా దర్గా.. నాలుగో జోన్‌లో ముసఫిర్‌ఖానా, సయ్యద్ అహ్మద్ బాబా దర్గా, రిసెప్షన్ సెంటర్.. ఐదో జోన్‌లో పిల్లల ఆట స్థలం, వాటర్ స్టాళ్లు, దుకాణాలు.. ఆరో జోన్‌లో బారాషహీద్ దర్గా, దర్గా కార్యాలయం ఉంటాయి. ఏడో జోన్‌లో పొదలకూరు రోడ్డును ఉంచారు.

సీసీ కెమెరాల నీడలో..

బారాషహీద్ దర్గా ఆవరణలో 60 కెమెరాలను ఏర్పాటు చేశారు. 40 ఫిక్స్‌డ్, 20 రొటేటెడ్ కెమెరాలు, రెండు డ్రోన్లతో నిఘాను ఉంచనున్నారు. ఐదు మానిటరింగ్ టీవీల్లో పోలీస్ శాఖ వీక్షించనుంది. స్వర్ణాల చెరువు వద్ద రెడ్ మార్కును భక్తులు దాటితే అప్రమత్తం చేసేందుకు ఓ కెమెరాను ఏర్పాటు చేశారు. దర్గాలోకి ఎంత మంది భక్తులు వస్తున్నారనే అంశాన్ని లెక్కించేందుకు గానూ హైటెక్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఆధ్వర్యంలో ఓ సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేశారు.

మొబైల్ టాయ్‌లెట్లు

పార్కింగ్ స్థలాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మొబైల్ టాయ్‌లెట్లు, స్నానపు గదులు, షవర్ బాత్స్, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, తాగునీటి వసతిని నగరపాలక సంస్థ ఏర్పాటు చేసింది. పార్కింగ్ స్థలాల్లో ఏదైనా ఘటనలు చోటు చేసుకుంటే వాటిని గుర్తించేందుకు వీలుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

బారాషహీద్ దర్గా ఆవరణలో నిరంతర విద్యుత్ సరఫరాకు గానూ మూడు 315 కేవీఏ, ఒక 250 కేవీఏ, ఐదు 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు 125 కెపాసిటీ కలిగిన జనరేటర్‌ను ఉంచారు. రోజూ 29 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేయనున్నారు. దర్గా ప్రాంగణంలో విద్యుత్ రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పండగ ఏర్పాట్లను కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం రాత్రి పరిశీలించారు.

రొట్టెల పండగ కార్యక్రమ వివరాలు..

జూలై 29	-	షహదత్
30వ తేదీ	-	గంధ మహోత్సవం
31వ తేదీ	-	రొట్టెల పండగ
ఆగస్ట్ 1	-	తహలీల్ ఫాతేహా
2వ తేదీ	-	ముగింపు

షహదత్‌తో ప్రారంభం

మొహర్రం నెల్లో నెలవంక కనిపించిన 11వ రోజున రొట్టెల పండగ ప్రారంభమవుతుంది. తొలి రోజు షహదత్, తర్వాతి రోజు గంధ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. కోటమిట్టలోని అమీనియా మసీదు నుంచి గంధాన్ని తీసుకొచ్చి 12 మంది షహీదులకు లేపనం చేసి భక్తులకు పంచుతారు. మరుసటి రోజు భక్తులు వివిధ రకాల రొట్టెలను మార్చుకుంటారు. తహలీల్ ఫాతెహాతో పండగ ముగియనుంది.



బారాషహీదుల సమాధులను దర్శించుకుంటూ..



దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లు



ఈత కొడుతూ యువత కేరింతలు



చెట్ల కింద సేదతీరుతున్న భక్తులు

పక్కాగా ఏర్పాట్లు

- ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల



దువా చేస్తున్న ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గాలో నిర్వహించనున్న రొట్టెల పండగకు ఏర్పాట్లను పక్కాగా చేశారని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్‌ను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి వేమిరెడ్డి శుక్రవారం సందర్శించారు. తొలుత బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వర్ణాల చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లపై వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చేలా చూడాలని అధికారులకు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఆర్డీఓ మలోల, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, కార్పొరేషన్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, రూరల్ తహసీల్దార్ సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా 30 మందిని నియమించామన్నారు. బీపీ, షుగర్ పరీక్షలను చేయనున్నారని, అవసరమైన వారికి అన్ని రకాల మందులు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. రెండు 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి



మొక్కలు నాటుతున్న జేసీ సతీమణి సుమలత

పొదలకూరు : గ్రామాల్లో చేపడుతున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ కోరారు. పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తన సతీమణి సుమలతతో కలిసి మొక్కలను శుక్రవారం నాటారు. అనంతరం యార్డులోని అగ్రి ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడారు. మొదటి విడత భూముల రీ సర్వేలో భూ సమస్యలతో కొన్ని పాస్‌పుస్తకాలను ఆపామని తెలిపారు. రెండో విడతలో రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. జిల్లాలోని 8 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలను నిలిపామని, మిగిలిన సచివాలయాల్లో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశామని చెప్పారు. జేసీ సతీమణి సుమలత మాట్లాడుతూ .. ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ పేరుతో గతేడాది తాము మొక్కలు నాటామన్నారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు మొక్కలు నాటుతున్నామని తెలిపారు. యార్డు సెక్రటరీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి, ఏపీఎం రోజ్‌మేరీ, ఏఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చంద్రబాబువి మోసపూరిత మాటలు

- ధ్వజమెత్తిన మంత్రి నాగార్జున



నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రతిపక్ష నేత చంద్రబాబు సిద్ధమయ్యారని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. నగరంలోని డీఆర్ ఉత్తమ హోటల్లో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. టీడీపీకి బలం లేకపోవడంతో అడ్డగోలుగా అందర్నీ కలుపుకొంటున్నారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొట్టడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు. 14 ఏళ్లు సీఎంగా వ్యవహరించిన చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పట్టించుకోలేదని ఆరోపించారు. ముళ్లపొదలు, వర్షమొస్తే మునిగిపోయే అమరావతి ప్రాంతంలో రాజధానిని పెట్టారని, ఇలాంటి వ్యక్తికి రాష్ట్రాన్ని పాలించే అర్హత ఉందానని ప్రశ్నించారు. తమకు అధికారమివ్వాలంటూ చంద్రబాబు మోసపూరిత మాటలు చెప్తున్నారని, వీటిని ప్రజలు విశ్వసించబోరని తెలిపారు. చంద్రబాబుకు వృద్ధాప్యంతో పాటు వైరాగ్యమొచ్చి తమ పార్టీ నేతలపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పెట్టలేని పరిస్థితుల్లో టీడీపీ ఉందని ఎద్దేవా చేశారు. అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాధిస్తున్నారని కొనియాడారు. జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమెంతో తమకు తెలుసునని.. రాష్ట్రం, జిల్లాలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు. రాష్ట్రంలోని రోడ్లు బాగున్నాయని, అధ్వానంగా ఉన్న వాటిని బాగు చేయిస్తున్నామని చెప్పారు. బోగోలులోని హాస్టల్‌ను తాను ఆకస్మికంగా తనిఖీ చేశానని, విద్యార్థులకు ఉత్తమ చదువుతో పాటు మంచి ఆహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. అనంతరం మంత్రిని జిల్లాకు చెందిన పలు సాంఘిక సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల ప్రధానోపాధ్యాయులు సత్కరించారు.

న్యాయవాదుల నిరసన



నెల్లూరు(లీగల్): మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి ఆపై లైంగిక దాడికి పాల్పడిన నీచమైన చర్యను ఖండిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ఆవరణలో క్యాండిళ్లతో నిరసనను శుక్రవారం చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ కోరారు. ఉపాధ్యక్షుడు సుభానీ, ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీ అన్వర్ బాషా, ట్రెజరర్ ధన్పాల్ రమేష్, సీనియర్ న్యాయవాదులు కోటయ్య, నన్నే సాహెబ్, నాపూరు శ్రీధర్ పాల్గొన్నారు.

2500 మందితో బందోబస్తు



బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పటిష్ట చర్యలు చేపట్టారు. నెల్లూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన ముగ్గురు ఏఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 48 మంది సీఐలు, 129 మంది ఎస్సైలు, 293 మంది ఏఎస్సై / హెచ్‌సీలు, 744 మంది కానిస్టేబుళ్లు, 96 మంది మహిళా కానిస్టేబుళ్లు, 282 మంది హోంగార్డులు, 49 మంది మహిళా హోంగార్డులతో పాటు ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిపి 2500 మంది బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. దివ్యాంగులు, వృద్ధుల దగ్గరుండి దర్గాను సందర్శించుకునేలా చర్యలు చేపట్టారు.

అవుట్‌పోస్ట్ ఏర్పాటు

దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్ట్ 24 గంటలూ పనిచేయనుంది. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్న సిబ్బంది 24 గంటలూ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉంటూ ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించేలా చర్యలు చేపట్టారు. దర్గా ఆవరణలో మఫ్టీలో క్రైమ్ పార్టీలను ఏర్పాటు చేశారు. దర్గా ఆవరణతో పాటు బస్టాండ్లు, పరిసర ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ నేర నియంత్రణకు చర్యలు చేపట్టనున్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. రొట్టెల పండగ బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి స్థానిక పోలీస్ కవాతు మైదానంలో శుక్రవారం దిశానిర్దేశనం చేశారు. స్వర్ణాల ఘాట్ వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిమితికి మించి.. లైఫ్ జాకెట్లు లేకుండా బోటు షికారుకు అనుమతించొద్దని పేర్కొన్నారు. బాంబ్, డాగ్ స్క్వాడ్లు నిరంతర తనిఖీలను నిర్వహించాలని పేర్కొన్నారు. రహదారులపై వాహనాలను నిలపకుండా.. షాపులను ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. ముందస్తు అనుమతి ఉన్న వాహనాలనే దర్గాలోకి అనుమతించాలని స్పష్టం చేశారు. బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి వసతి, భోజన ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. దర్గా ఆవరణలో బందోబస్తు ఏర్పాట్లను రాత్రి పర్యవేక్షించారు.

క్లుప్తంగా

కారు బోల్తా ముగ్గురికి గాయాలు



బోల్తాపడిన కారులోని ప్రయాణికులను బయటకు తీస్తున్న స్థానికులు

సంగం : మండలంలోని కోలగట్ల సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం కారు బోల్తా పడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు..మర్రిపాడు మండలం డీసీపల్లికి చెందిన ఇద్దరు పని నిమిత్తం కారులో శుక్రవారం ఉదయం కావలికి వెళ్లారు. తిరిగి డీసీపల్లికి వెళ్తుండగా కోలగట్ల సమీపంలో డ్రైవర్ కునుకు తీయడంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు కారులోని మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న సంగం పోలీసులు గమనించి స్థానికుల సాయంతో బయటకు తీసి ఇంటికి పంపించారు.

గాయపడిన మరో యువకుడి మృతి



ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి–ధర్మవరం మధ్యన గురువారం రాత్రి రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ధర్మవరానికి చెందిన కాలే వెంకటేశ్వర్లు(35) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నార్తుకొండాయపాలేనికి చెందిన మరో యువకుడు చిందే ప్రతాప్(31)ను ఒంగోలులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం వేకువన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకే పంచాయతీకి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా శుక్రవారం ఉదయం ఘటనా స్థలాన్ని ఉదయగిరి సీఐ గిరిబాబు పరిశీలించారు. ఆయన వెంట వరికుంటపాడు, ఉదయగిరి ఎస్సైలు విజయ్‌శ్రీనివాస్, కే ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

వరద బాధితులను ఉదారంగా ఆదుకోండి



సీఎం వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి ప్రజలను మానవత్వంతో ఉదారంగా ఆదుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ వర్షాలు, వరదల ప్రభావంపై జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ ఎం హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ హిమవతి, జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టాలని, పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. జలదిగ్బంధంలోని ప్రజలకు నిత్యావసర సరుకులు, బియ్యం అందించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులను చిరునవ్వుతో తిరిగి ఇళ్లకు పంపించాలని, ఇళ్లకు వెళ్లేటప్పుడు ఒక్కో కుటుంబానికి రూ.2వేలు, ఒక వ్యక్తి ఉంటే రూ.1000 సాయం అందించాలని సూచించారు. ముంపుతో దెబ్బతిన్న ఇళ్లకు నష్టం అంచనా వేసి రూ.10వేలు సాయం అందించి బాధితులకు అన్ని విధాలా అండగా నిలవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ సుస్మిత, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ జేడీలు మహేశ్వరుడు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 127
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 246
లేయర్ చికెన్	: 150



నిమ్మధరలు



పెద్దవి	: రూ. 35
సన్నవి	: రూ.23
పండ్లు	: రూ. 7

మనసున్న నేత సీఎం వైఎస్ జగన్

• రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ఎంపీ వేమిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న, డీసీఎంఎస్ చైర్మన్ చలపతిరావు

కొడవలూరు: మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనసున్న మంచి నేత అని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని కమ్మపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయోత్సవ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు ఎంపీ వేమిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌ను వ్యతిరేక మీడియా మరో రకంగా చూపుతోందన్నారు. మంచి వ్యక్తిత్వం కలిగిన సీఎంపై చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదన్నారు. స్వయంగా తాను సీఎం మంచితనాన్ని అనేక సందర్భాల్లో చూశానన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను లోక్‌సభకు పోటీ చేయాలని సీఎం కోరారని, అందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కమ్మపాళెంలో ఎమ్మెల్యే ప్రసన్న చేపట్టిన అభివృద్ధిని చూసి పులకించిపోతున్నానన్నారు. స్థానిక నేత బెల్లం వెంకయ్యనాయుడు గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో చూస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవడంతో పాటు తనను ఎంపీగా, సీనియర్ ఎమ్మెల్యే ప్రసన్నను మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.

అపర భగీరథుడు ఎంపీ వేమిరెడ్డి

ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సొంత నిధులతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చిన అపర భగీరథుడని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్ ఓ అద్భుతమైన ఆలోచనతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా తామంతా సాధ్యమేనా అని ఆలోచించామన్నారు. గడప గడపకు వెళ్లడం ఆరంభించాక ప్రతి ఇంట్లో చూపిన ఆప్యాయతలు తమలో ఆనందాన్ని నింపి నడిపించాయన్నారు. గడప గడపకు కార్యక్రమం విజయవంతానికి సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. అనంతరం గడప గడపకు విజయవంతానికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఎంపీ చేతుల మీదుగా శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పార్టీ యువజన విభాగం నేత రూప్‌కుమార్ యాదవ్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జీ జ్యోతి, పార్టీ మండల కన్వీనర్లు గంధం వెంకటశేషయ్య, మావులూరు శ్రీనివాసులురెడ్డి, సతీష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దూషణల సంస్కృతి నెల్లూరుది కాదు



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: దూషణల సంస్కృతి నెల్లూరుది కాదని, గతం ఎప్పుడూ లేదని, ఇది మంచిది కాదని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలోని 41వ డివిజన్‌లో రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ బారాషహీద్ దర్గాలో రాష్ట్ర పండగ రొట్టెల పండగను ఘనంగా నిర్వహిస్తుంటే కొందరు ఓర్వలేక పెయిడ్ ఆర్టిస్టులతో విమర్శలు చేయిస్తున్నారన్నారు. 30 ఏళ్లుగా నెల్లూరువాసులుకు తానేంటో తెలుసునని, తనపై విమర్శలు చేస్తే వారికే నష్టం తప్ప ఒరిగేదేమీ లేదన్నారు. తమ ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో 41వ డివిజన్‌లో రూ.3.50 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఇటీవల రూ.20లక్షలతో సీసీరోడ్డు నిర్మించామని తెలిపారు. డివిజన్‌లోని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు మరో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వెచ్చిస్తామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో గొప్పదని, ప్రజల అవసరాలను తీర్చిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు విజయలక్ష్మి, అవినాష్, డివిజన్ ఇన్‌చార్జి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకులు నూనె మల్లికార్జున్‌యాదవ్, స్వర్ణా వెంకయ్య, నవీన్‌కుమార్‌రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, ఆర్‌ఎస్సార్, మేఘనాథ్‌సింగ్, హరిబాబుయాదవ్, పాశం శ్రీనివాసులు, శివసునీల్‌రెడ్డి, నరేంద్ర రెడ్డి , సుబ్బారెడ్డి, నరసింహారావు, మధు, తలారి విరల్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏ ఆత్మహత్య

వలేటివారిపాలెం: వీఆర్‌ఏ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అంకభూపాలపురంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వలేటివారిపాళెం మండలంలోని అంకభూపాలపురంలో కామినేని నాగూర్ (60) వీఆర్‌ఏగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారం రోజుల నుంచి నిత్యం మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి కూడా మద్యం సేవించి తన రెండో కుమారుడైన శివతో వాగ్వాదానికి దిగి గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో భార్య చిన్నమ్మ తలుపు పగుల గొట్టి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. కుమారుడి సాయంతో నాగూర్‌ను కిందకి దించి, 108కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి నాగూర్ మృతి చెందినట్లుగా నిర్ధారించారు. నాగూర్ భార్య చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపారు.

రాబోయే ఎన్నికలే టీడీపీకి చివరివి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

అల్లూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికలే టీడీపీకి చివరి ఎన్నికలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పడమర గోగులపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటమి కళ్ల ముందు కనిపిస్తోందని, అందుకే ఇవే నాకు చివరి ఎన్నికలంటూ ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవడం కష్టమని తెలిసి చంద్రబాబు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో నెరవేర్చి ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించకుండా జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనాన్ని దోచేశారన్నారు. కానీ నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వినూత్న పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేస్తూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు పసలేని ఆరోపణలు చేస్తున్నారని, అయినా ప్రజలు వారి మాటలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, నాయకులు నీలం సాయికుమార్, బీద రమేష్, కోడూరు సాధిక్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మధురెడ్డి, తాండ్ర మల్లి, రఘురామ్, నిరంజన్, పురిణి గోపాల్, దాసరి గోపాల్, పురిణి శీనయ్య, చిరంజీవి, నిమ్మల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక చేయూత



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి నవరత్నాలలో ఏదోక పథకం ద్వారా ఆర్థిక చేయూత అందుతోందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని 17, 19, 20 వార్డుల సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను చూపి వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. ఏసీఎస్‌ఆర్ కాలనీలో దారా కమలమ్మ కుటుంబ సభ్యులు తమకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.18 లక్షలకు పైగా ఆర్థిక చేయూత అందినట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాము జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా ఇళ్లకే చేరుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 98 శాతం నెరవేర్చడంతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు మరో 20 ఏళ్లకుపైగా వైఎస్ జగన్ రాష్ట్రానికి సీఎంగా కొనసాగుతారని చెబుతున్నారన్నారని ఎమ్మెల్యే అన్నారు. స్థానికులు సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మించాలని కోరగా ,ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక అందజేయాలని కమిషనర్‌కు సూచించారు. త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పఠాన్ మాసూమ్‌సా అనే వ్యక్తికి సాంకేతిక కారణాలతో పింఛన్ మంజూరు కాకపోవడంతో అతని ఆర్థిక, అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా మందుల కోసం కొంత ఆర్థిక సాయం చెక్కు రూపంలో అందజేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ ఆదిశేషయ్య, చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు కేవీ శ్రావణ్‌కుమార్, సర్దార్, కౌన్సిలర్ స్వరూపారాణి, సొసైటీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కే వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రమణారెడ్డి, జమీర్, రహీం, కలాం, వినయ్‌కుమార్ రెడ్డి, బాలఅంకయ్య, కిషోర్, స్థానిక కార్యకర్తలు, అనంతసాగరం జెడ్పీటీసీ సుబ్బారెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ, సర్పంచ్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పది పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడంతో పాటు పలుచోట్ల ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. దర్గా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు రాకపోకలు సాగించేందుకు వీలుగా పాస్‌లను మంజూరు చేస్తున్నారు. ట్రాఫిక్ విధుల్లో ముగ్గురు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 42 మంది ఎస్సైలు, 111 మంది ఏఎస్సై / హెచ్‌సీలు, 316 మంది కానిస్టేబుళ్లు, 167 మంది హోమ్‌గార్డులు విధులు నిర్వర్తించనున్నారు. వీరు మూడు షిఫ్టుల్లో 24 గంటలూ విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టారు.

పార్కింగ్‌కు క్యూఆర్ కోడ్ ఏర్పాటు

వాహనాల పార్కింగ్ కోసం క్యూఆర్ కోడ్‌ను పోలీస్ శాఖ రూపొందించింది. కోడ్‌ను స్కాన్ చేస్తే పార్కింగ్ ప్రదేశాలు తెలుస్తాయి. వాహనాన్ని ఎక్కడ పార్కింగ్ చేయాలో క్లిక్ చేస్తే జీపీఎస్ ద్వారా నేరుగా అక్కడికి వెళ్లేందుకు రూట్ మ్యాప్ వస్తుంది.

వాహనాల దారి మళ్లింపు

- చెన్నై, బెంగళూరు, తిరుపతి, గూడూరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను అయ్యప్ప గుడి ఫ్లైఓవర్, బీవీనగర్, రామలింగాపురం అండర్ బ్రిడ్జి, ఏసీ మార్కెట్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు దారి మళ్లించారు.
- పొదలకూరు రోడ్డు వైపు నుంచి వచ్చే బస్సులు కొండాయపాళెం గేట్, కేవీఆర్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోనున్నాయి.
- జొన్నవాడ వైపు నుంచి వచ్చే బస్సులను పుత్తా ఎస్టేట్స్, ములుమూడి బస్టాండ్ మీదుగా బస్టాండ్‌కు దారి మళ్లించారు.
- బట్వాడిపాళెం నుంచి పోలీస్ ఆఫీస్ మీదుగా వెళ్లే వాహనాలను మూలాపేట వైపు మళ్లించారు.
- కేవీఆర్ పెట్రోల్ బంక్ వైపు నుంచి పోలీస్ ఆఫీస్ మీదుగా వెళ్లే వాహనాలను మూలాపేట వైపు దారి మళ్లించారు. ఈ రహదారి మీదుగా రాకపోకలను పూర్తిగా నిషేధించి బారికేడ్లను ఏర్పాటు చేశారు.

పార్కింగ్ ప్రదేశాలివే..

- బెంగళూరు, చెన్నై, తిరుపతి, గూడూరు మీదుగా నెల్లూరొచ్చే వాహనాలకు జీజీహెచ్ ప్రాంగణం, డీమార్ట్ సమీపంలోని సైన్స్ పార్కు వద్ద పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు.
- విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కావలి వైపు నుంచి వచ్చే వాహనాలను ఎస్వీజీఎస్ కళాశాల గ్రౌండ్స్‌లో నిలిపేలా చర్యలు చేపట్టారు.
- బుచ్చి, కోవూరు వైపు నుంచి వచ్చే లారీలు, టెంపోలు, బస్సులకు డీమార్ట్ సమీపంలోని సైన్స్ పార్క్.. ఆటోలు, కార్లు, మినీ వ్యాన్లు, టెంపోలకు వీఆర్సీ, వైఎమ్సీఏ గ్రౌండ్స్‌లో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు.
- అనంతపురం, కడప, బద్వేలు, తదితర ప్రాంతాల నుంచి జొన్నవాడ మీదుగా వచ్చే లారీలు, టెంపోలు, బస్సులకు ఇరుకళల పరమేశ్వరి దేవస్థాన ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం, డీఎస్సెన్ మినీ ఫంక్షన్ హాల్ వద్ద పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించారు.
- కార్లు, ఆటోలు, టెంపోలు, మినీ వ్యాన్లకు కస్తూరిదేవి గార్డెన్స్ ఎదురుగా గల ఖాళీ స్థలంలో పార్కింగ్‌ను కల్పించారు.
- కడప, రాజంపేట, రాపూరు, పొదలకూరు మీదుగా వచ్చే లారీలు, టెంపోలు, బస్సులను తెలుగుగంగ కాలనీ సమీపంలోని రేడియో స్టేషన్ ఎదురుగా గల ఖాళీ స్థలంలో.. కార్లు, మినీ వాహనాలను పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలికల పాఠశాలలో నిలిపేలా చర్యలు చేపట్టారు.

31న జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 31న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, రిలయన్స్ స్మార్ట్‌లలో స్టోర్, సూపర్‌మార్కెట్ ఆపరేటర్స్, బిల్లింగ్, కస్టమర్ సర్వీసెస్ ట్రెయినీ అసోసియేట్స్, ఫార్మాసిస్ట్, ఫార్మా అసిస్టెంట్, ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ అర్హతలు కలిగిన 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

సీఎం జిల్లా వారైతే అనర్హులా!

సాక్షి, అమరావతి: విదేశీయులు మన దేశంలో కంపెనీలు, పరిశ్రమలు స్థాపిస్తున్నారు. మన రాష్ట్రం నుంచి ఎంతో మంది దేశ, విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆ ఊరు, ఈ ఊరు అనే తేడా లేదు. జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ఎక్కడైనా అర్హత ఉన్న ఎవరైనా చట్టం, నిబంధనల మేరకు ఏదైనా చేయవచ్చు. దీనిని విశ్వవ్యాప్తంగా ఎవరూ కాదనరు. కానీ ఈనాడుకు మాత్రం సీఎం సొంత జిల్లా వారు ఎలాంటి వ్యాపారాలు చేయకూడదని, టెండర్లు దక్కించుకోకూడదన్న అభిప్రాయం నరనరానా జీర్ణించుకుపోయింది. అందుకే వారు వ్యాపారాలకు అనర్హులనేలా కథనాలు అల్లుతోంది. పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చ డానికి సీలేరులో రెండు అదనపు విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) టెండర్లు పిలిచింది. అత్యంత పారదర్శకంగా బిడ్లు ఆహ్వానించి, రివర్స్ టెండరింగ్ ద్వారా టెండరు ఖరారు చేసింది. కానీ ఇదంతా తప్పన్నట్టు 'ఈనాడు' శుక్రవారం ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఆ పత్రిక అధినేత రామోజీరావు పచ్చళ్లు అమ్ముకోవచ్చు.. పత్రికనూ నడుపుకోవచ్చు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి మాత్రం విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు టెండర్ ఇవ్వకూడదు. వారికి, వారు కొమ్ముకాస్తున్న వారికి ఒక న్యాయం.. సీఎం సొంత జిల్లా వారైతే మరో న్యాయం.. ఇదేం రామోజీ జర్నలిజం. ఏపీ జెన్‌కో వెల్లడించిన వివరాల ప్రకారం ఈ టెండర్లలో వాస్తవాలు అంశాల వారీగా ఇలా ఉన్నాయి.

ఆరోపణ: వైఎస్సార్ జిల్లాకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టింది. ఈ సంస్థ వైఎస్సార్ జిల్లాకు చెందిన వ్యక్తికి సంబంధించినది కావడమే దానికి ఉన్న ఏకైక అర్హత.

వాస్తవం: ఏపీ జెన్‌కో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన రివర్స్ టెండరింగ్ ద్వారానే షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ఈ కాంట్రాక్టును కైవసం చేసుకుంది. ఇందులో ఏపీ జెన్‌కో, ప్రభుత్వం ప్రమేయం ఏమీ లేదు. ఈ కన్సార్టియం భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ప్రతిష్టాత్మక బీహెచ్ఈఎల్‌తో ఈ ప్రాజక్టు యంత్ర పరికరాల సరఫరాకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ఉన్న యూనిట్లకు కూడా బీహెచ్ఈఎల్ యంత్ర పరికరాలు సరఫరా చేసింది. కన్సార్టియంలోని మరో కంపెనీ పీఈఎస్‌కు ఇదివరకే ఈ ప్రాజక్టులో సివిల్ పనులు చేసిన అనుభవముంది. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుని, కాంట్రాక్టు సంస్థను ఎంపిక చేసింది. ఈ ప్రాజక్టు పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 2024కల్లా పూర్తవుతాయి.

ఆరోపణ: దిగువ సీలేరులో రెండు అదనపు యూనిట్ల నిర్మాణానికి అయ్యే వ్యయం, జీఎస్టీ, ఆలస్యానికి అయ్యే వడ్డీతో కలిపి రూ. 571 కోట్ల రుణాన్ని గ్రామీణ విద్యుత్ సంస్థ (ఆర్‌ఈసీ) నుంచి ప్రభుత్వం తీసుకుంది.

వాస్తవం: పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రుణం తీసుకోవడం సర్వసాధారణం. ఇందులో తప్పేముంది?

ఆరోపణ: ఇప్పటికే షిర్డీ సాయి, దాని అనుబంధ సంస్థలకు రూ. 92 వేల కోట్ల విలువైన వివిధ విద్యుత్ ప్రాజెక్టులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: ఏపీ జెన్‌కోగానీ, డిస్కంలు గానీ నామినేషన్ పద్ధతిలో ఏ పనులూ ఎవరికీ కేటాయించలేదు. వివిధ ప్రాజెక్టుల కోసం పారదర్శకంగా టెండర్లు నిర్వహించాయి. అర్హతల మేరకు పోటీ బిడ్డింగ్‌లో పాల్గొని ఏ సంస్థ అయినా పనులు దక్కించుకోవచ్చు.

ఆరోపణ: ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ (గ్లోబల్ టెండర్లు– ఇ ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం) ద్వారా ఏపీ జెన్‌కో టెండర్లు పిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జుడిషియల్ కమిషన్ కూడా సమీక్షించి ఈ ప్రాజెక్టు టెండర్లకు ఆమోదం తెలిపింది. రాఘవ ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌సీసీ, పీఈఎస్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిపి షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ జాయింట్ వెంచర్ సంస్థ బిడ్లు దాఖలు చేసింది. టెండర్లలో కోట్ అయిన అతి తక్కువ మొత్తాన్ని గరిష్టంగా తీసుకుని ఏపీజెన్‌కో రివర్స్ టెండర్లు నిర్వహించింది. ఈ రివర్స్ టెండరింగ్‌లో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ తక్కువ మొత్తానికి ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చి కాంట్రాక్టు దక్కించుకుంది. రెండు దశల (సాంకేతిక, ఆర్థిక) బిడ్డింగ్ ప్రాతిపదికన ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు సంస్థను ఎంపిక చేసింది. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ వల్ల ఏపీ జెన్కోకు దాదాపు రూ.10 కోట్లు ఆదా అయ్యింది.

ఆరోపణ: ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పర్యావరణ, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతులు రాకముందే హడావుడి చేసింది.


వాస్తవం: విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను ఏపీఈఆర్‌సీకి ముందే చెప్పారు. ప్రతిపాదనను పరిశీలించి డిస్కంలు, జెన్‌కో కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుని కమిషన్ అనుమతి కోసం అప్పుడు పంపాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతి ఈ నెల 7న వచ్చింది. ఈ ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం రూ.1000 కోట్లు దాటనందున కేంద్ర విద్యుత్ ప్రాధికారిక సంస్థ (సీఈఏ) అనుమతి అవసరం లేదు.

ఆరోపణ: రెండు కొత్త యూనిట్లు నిర్మించడం వల్ల దిగువ సీలేరు ప్రాజెక్టు నుంచి అదనంగా ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి అయ్యే పరిస్థితి లేదు.

వాస్తవం: జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి మన గ్రిడ్ అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు 115 మెగావాట్ల యూనిట్లు ఏటా దాదాపు 1100 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయి. దిగువ సీలేరు విద్యుత్ కేంద్రం మొట్టమొదట నిర్మించినప్పుడే ఆరు యూనిట్ల ఏర్పాటుకు కావలసిన ప్రధాన మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో అదనంగా మరో రెండు 115 మెగావాట్ల యూనిట్లు నిర్మించాలని ఏపీ జెన్‌కో నిర్ణయించింది. కొత్త యూనిట్లు నెలకొల్పడం వల్ల ఈ విద్యుత్ కేంద్రం గరిష్ట లోడ్ సామర్థ్యం పెరుగుతుంది. దాంతో మార్కెట్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనవలసిన అవసరం తగ్గుతుంది. ప్రతి 115 మెగావాట్ల యంత్రం పీక్ డిమాండ్ సమయంలో సగటున 175 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయగలదు. దీనివల్ల డిస్కంలకు ఏటా 350 మిలియన్ యూనిట్లు విద్యుత్ మార్కెట్‌లో కొనాల్సిన అవసరం తగ్గి, ఆ మేరకు లాభం చేకూరుతుంది. పీక్ సమయాల్లో మార్కెట్ రేటు యూనిట్‌కు దాదాపు రూ.10 ఉంటోంది. సరాసరి పీక్ లోడ్ విద్యుత్ ధర రూ.8.0 అనుకున్నా ఈ రెండు యూనిట్ల వల్లా ఏటా దాదాపు రూ .280 కోట్లు ఆదా అవుతుంది.

నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు

▶ మొదటి పేజీ తరువాయి



ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్‌ని, వివేకా కేసు విచారణాధికారి (ఏఎస్పీ)ని ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌లో ఆయన పేర్కొన్న వివరాలు.. 'ఏప్రిల్ 29న నేను వాంగ్మూలం ఇస్తుండగా.. అధికారి మరొకరిని లోపలికి పిలిచారు. ఆయన ల్యాప్‌ట్యాప్‌తో వచ్చి ఏదో రికార్డు చేసుకున్నాడు. ఆయన ఏం రికార్డు చేసింది నాకు చూపించలేదు. కనీసం చదివి వినిపించలేదు. నాకు తెలిసినంతవరకు నా వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డు కూడా చేయలేదు. సీబీఐ నా స్టేట్‌మెంట్‌ను తప్పుడు రికార్డు చేసినట్లు మే 17న ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ద్వారా తెలుసుకున్నా. నా వాంగ్మూలం గురించి నేను ఎవరి వద్దా ప్రస్తావించలేదు. కానీ, ఆ పత్రికలో ఎలా వచ్చిందో నాకు అర్థంకాలేదు. ఆశ్చర్యం వేసింది. ఆ పత్రికలో పేర్కొన్నదంతా అసత్యపూరితం. పత్రికలో వచ్చిన దానిపై ఎలక్ట్రానిక్ మీడియా చర్చా కార్యక్రమాలు పెట్టడంతో నేను విలేకరుల సమావేశం పెట్టి.. ఆ పత్రికది కట్టుకథ అని చెప్పాల్సి వచ్చింది. సీబీఐ నమోదు చేసింది కూడా నేను చెప్పింది కాదని తెలిసింది. అయితే సీఆర్‌పీసీ 161 కింద రికార్డు చేసిన కాపీ నావద్ద లేనందున నా వాంగ్మూలం తప్పుగా పేర్కొన్న విషయాన్ని తెలుసుకోలేకపోయా. 2019 మార్చి 15న ఉదయం 5.30 గంటల సమయంలో అటెండరు వచ్చి అమ్మ (భారతి) పిలుస్తున్నారంటూ జగన్‌కు చెప్పాడని తాను చెప్పినట్టు, బయటకు వెళ్లిన జగన్ పది నిమిషాల తరువాత తిరిగివచ్చి చిన్నాన్న ఈజ్ నో మోర్ అని అన్నారని, షాక్‌కు గురైన మేము కడపకు వెళ్లాలని ఆయనకు సూచించి బయటకు వచ్చేశామని జూన్ నెలలో వేసిన చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది. ఈ విషయం పత్రికల్లో వచ్చిన సమాచారం ద్వారా నాకు తెలిసింది.

ఏం చెప్పానంటే..

ఏప్రిల్ 29న నన్ను విచారించిన అధికారికి స్పష్టంగా ఏం చెప్పానంటే.. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో తయారీ సమావేశం 2019 మార్చి 15న ఉదయం సుమారు 5 గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో ప్రారంభమైంది. అరగంట తర్వాత ఒక అటెండర్ సమావేశగది తలుపు తట్టాడు. బయటికి వెళ్లి విషయం తెలుసుకుని వచ్చిన ఓఎస్డీ.. జగన్ చెవిలో ఏదో చెప్పారు. దీంతో జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి, ఆశ్చర్యానికి గురయ్యారు. 'చిన్నాన్న చనిపోయారు' అని చెప్పారు. అంతేతప్ప జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన జీవిత భాగస్వామిని పిలవడం లాంటివి ఏమీ చెప్పలేదు. దురదృష్టవశాత్తు నేను చెప్పింది సీబీఐ సరిగ్గా రికార్డు చేయలేదు. చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది పూర్తిగా అసంబద్ధం. దర్యాప్తును తప్పుదారి పట్టించి.. ఇతరులను కేసులో ఇరికించే ధోరణితోనే సీబీఐ ఇలా తప్పుగా పేర్కొంది. నా స్టేట్‌మెంట్‌పై సంతకం చేసిన అధికారి, నన్ను విచారించిన అధికారి ఒకరు కాదు. దర్యాప్తు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాజ్యాంగ ధర్మాసనాలు పదేపదే చెబుతున్నా.. కొందరు మాత్రం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దర్యాప్తు చేయడం అంటే అస్పష్టమైన సత్యాన్ని బయటికి తీసుకురావడం. కానీ, ఇక్కడ అధికారులు అలా వ్యవహరించలేదు. నేను చెప్పకున్నా చెప్పినట్లు సీబీఐ తప్పుడు వాంగ్మూలాన్ని సమర్పించడం ఎంతమాత్రం సరికాదు. ఇతర వ్యక్తులను చిక్కుల్లో పడేసేందుకే సీబీఐ తప్పుడు సమాచారం చేర్చింది. ఈ అంశాలను పరిశీలించి హైదరాబాద్ సీబీఐ కోర్టులో సమర్పించిన చార్జిషీట్ నుంచి తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించాలి.'

ఏపీ ఇన్ పార్లమెంట్

ప్రత్యేకదళాల్లో చేరికకు లింగభేదం లేదు

సాక్షి, న్యూఢిల్లీ: భారత సాయుధ దళాల్లోని ప్రత్యేకదళాల్లో చేరడానికి లింగభేదం లేదని కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి అజయ్ భట్ తెలిపారు. గుణాత్మక అవసరాల మేరకు ఎంపిక, విజయవంతమైన శిక్షణ పూర్తిచేస్తే మహిళా అధికారులు ఎలాంటి లింగభేదం లేకుండా ప్రత్యేకదళాల్లో స్వచ్ఛందంగా చేరడానికి అర్హులని చెప్పారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు వంగా గీత, బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, ఆదాల ప్రభాకరరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. భారత వైమానిక దళంలో ఇద్దరు మహిళలు ప్రత్యేకదళాల శిక్షణకు స్వచ్ఛందంగా వచ్చారని, అయితే వారు ఉత్తీర్ణత సాధించలేకపోయారని తెలిపారు. నేవీలో 20 మంది అగ్నివీర్‌లు ప్రత్యేకదళంలో చేరడానికి పరీక్షకుహాజరయ్యారని, వారెవరూ అర్హత సాధించలేకపోయారని చెప్పారు.

దేశవ్యాప్తంగా 122 మంది మెడికోల ఆత్మహత్య

దేశవ్యాప్తంగా 559 వైద్య కళాశాలలు ఇచ్చిన సమాచారం మేరకు 122 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి భారతీప్రవీణ్ పవార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. నేషనల్ మెడికల్ కమిషన్‌లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆర్‌టీఐ దరఖాస్తుకు సమాధానంగా ఐదేళ్లలో ఆత్మహత్యలు, డ్రాప్ అవుట్‌ల వివరాలు ఇచ్చిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పీజీలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా.. తొమ్మిది కళాశాలల్లో 38 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని తెలిపారు. ఎంబీబీఎస్‌లో మూడు కళాశాలల్లో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా.. ఆరు కళాశాలల్లో 13 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని చెప్పారు.

మైన్స్ మినరల్స్ సవరణ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు

మైన్స్, మినరల్స్ సవరణ బిల్లు–2023కు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. ఈ బిల్లుపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం 16,604 ఎకరాల్లో 16 బీచ్‌శాండ్ మినరల్స్ బేరింగ్ ఏరియాలను ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రిజర్వు చేసిందని తెలిపారు. 14 మినరల్ బేరింగ్ ఏరియాలకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ బీచ్‌శాండ్ మినరల్స్ ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్థాపించి వైఎస్సార్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా రాయలసీమ ప్రజలకు స్థిరమైన ఉపాధి, జీవనోపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఉక్కు కర్మాగారం ఏడాదికి మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతోపాటు హై–గ్రేడ్ స్టీల్ ఉత్పత్తిపై దృష్టి సారిస్తుందని తెలిపారు.

మాయల ఫకీరు బాబు మాయలో పడొద్దు

- పురందేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కౌంటర్

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాటలు ఆమె మరిది చంద్రబాబు స్క్రిప్టులా ఉన్నాయి తప్ప సొంతంగా మాట్లాడారని అనిపించడంలేదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలా? లేక బాబు గారి జనతా పార్టీకి అధ్యక్షురాలా? అనే సందేహం వస్తోందన్నారు. మంత్రి శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. మాయల ఫకీరు చంద్రబాబు ట్రాప్‌లో పడితే పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వర్లు రాజకీయ జీవితం భూస్థాపితం అయిపోయినట్లే ఆమె రాజకీయ జీవితమూ ముగిసిపోతుందని చెప్పారు. ఆమె భర్త ఆనాడు రాసిన పుస్తకానికి పార్ట్–2 రాయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ మద్యం ఆదాయంతోనే ఇస్తున్నారని అంటున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మద్యం లేదా? ఆదాయం రావడంలేదా అని ప్రశ్నించారు. వివిధ విభాగాల ఆదాయంతోనే ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ నిర్ణయాలు, హామీలను అమలు చేస్తారని చెప్పారు. పురందేశ్వరి ఆమె మరిది బాబు హయాంలోని భూ కుంభకోణాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. విశాఖ ఎంపీగా చేసిన ఆమె విశాఖ రైల్వే జోన్‌పైన, విశాఖ ఉక్కు పైన ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు.

సినిమా

పట్టుకుంటే పది వేలు


● ధనుష్

బందిపోటుగా, హంతకుడిగా ముద్రపడిన 'కెప్టెన్ మిల్లర్'ను పట్టుకున్న వారికి పదివేల రూపాయల రివార్డును ప్రకటిస్తూ 1930లో ఓ పోలీస్ నోట్ విడుదలైంది. మరి.. అప్పటి ప్రభుత్వానికి కెప్టెన్ మిల్లర్ చిక్కాడా? అసలు అతని కథ ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు డిసెంబరులో థియేటర్స్‌లో దొరుకుతాయి. ధనుష్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో టీజీ త్యాగరాజన్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) ధనుష్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కెప్టెన్ మిల్లర్' టీజర్‌ను విడుదల చేసి, సినిమాను డిసెంబరు 15న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'కెప్టెన్ మిల్లర్'లో కీలక పాత్ర చేసిన హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ సినిమా కాకుండా ధనుష్ అన్న దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డీ 50'లోనూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాను'' అని అన్నారు. ''1930–1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీ రోల్ చేస్తున్నారు.

నెచ్చెలి విసిరినది వెచ్చని వల...


● సమంత, విజయ్ దేవరకొండ

'ఖుషీ నువ్వు కనబడితే.. ఖుషీ నీ మాట వినబడితే...' అంటూ మొదలైంది 'ఖుషి' సినిమా టైటిల్ సాంగ్. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం ఇది. శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. 'ఖుషీ నువ్వు కనబడితే' అని మొదలై, 'హే నెచ్చెలి నెచ్చెలి వచ్చి విసిరినది వెచ్చని వెచ్చని వల.. హే ముచ్చటగా నను గిల్లి గిచ్చినది కల..' అంటూ సాగుతుందీ పాట. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకు లిరిక్స్ అందించగా, ఈ చిత్ర సంగీత దర్శకుడు హిషామ్ అబ్దుల్ వాహబ్ పాడారు.

లక్కీ భాస్కర్


● దుల్కర్ సల్మాన్

'మహానటి, సీతారామం' వంటి వరుస విజయాల తర్వాత తెలుగులో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ధనుష్‌తో 'సార్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) దుల్కర్ సల్మాన్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ప్రకటించారు. ''నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి కథగా 'లక్కీ భాస్కర్' రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా వెంకీ అట్లూరి మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు'' అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

'కాంత'.. దుల్కర్ బర్త్ డే సందర్భంగా 'కాంత' అనే మరో చిత్రం ప్రకటన వెల్లడైంది. ఈ చిత్రంలో దుల్కర్ హీరోగా నటించడంతో పాటు రానాతో కలిసి నిర్మిస్తున్నారు. గతంలో 'నిలా' చిత్రం, 'ద హంట్ ఆఫ్ వీరప్పన్' డాక్యుమెంటరీ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ 'కాంత'ను తెరకెక్కించనున్నారు.


● అదితీరావ్ హైదరి

తొలి అడుగు

ఇటు సౌత్.. అటు నార్త్.. కాస్త ఖాళీ దొరికితే డిజిటల్ వరల్డ్... ఇలా వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటున్నారు హీరోయిన్ అదితీరావ్ హైదరి. అయితే తొలిసారి ఈ బ్యూటీ ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. తమిళ దర్శక–నటుడు రాజేష్ ఎమ్. సెల్వ ఇటీవల కథానాయిక ప్రాధాన్యంగా సాగే ఓ కథ తయారు చేశారని, ఈ కథ విని, ఇందులోని పాత్ర నచ్చడంతో అదితీరావ్ హైదరి పచ్చ జెండా ఊపారని కోలీవుడ్ టాక్. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెలలో ఆరంభం కానుందట. లేడీ ఓరియంటెడ్ చిత్రాల పరంగా అదితీకి ఇది తొలి అడుగు. మరి.. ఈ తొలి అడుగుతో ఈ తరహా చిత్రాలు ఇంకెన్ని చేస్తారో చూడాలి. ఇక 'సమ్మోహనం, వి, అంతరిక్షం, మహాసముద్రం' వంటి చిత్రాలతో అదితీరావ్ హైదరి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే.

హద్దుల్లో ఉంటే అడ్డే ఉండదు

- హీరోయిన్ శ్రీలీల



''చిత్ర పరిశ్రమ అనేది గౌరవం ఉన్న ఇండస్ట్రీ. మన హద్దుల్లో మనం ఉండి సినిమాలు చేసుకుంటే అడ్డేదీ ఉండదు.. ఎలాంటి ఇబ్బందులు రావు. తెలుగమ్మాయి అయిన హీరోయిన్ ప్రణవికి నేను ఇచ్చే సలహా ఇదే'' అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమా రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ ద్వారా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలీల మాట్లాడుతూ– ''స్లమ్ డాగ్ హజ్బెండ్ సినిమా సూపర్ హిట్ కావాలి'' అన్నారు. ''మా సినిమాలో వినోదం, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి'' అన్నారు ఏఆర్ శ్రీధర్. ''శ్రీలీల, వైష్ణవీ చైతన్య, ప్రణవి తెలుగు అమ్మాయిలే. నా కొత్త సినిమాకు తెలుగు అమ్మాయినే హీరోయిన్‌గా తీసుకుంటా'' అన్నారు డైరెక్టర్ బుచ్చిబాబు సానా. ''స్లమ్ డాగ్ హజ్బెండ్ హిట్ అయితే మరో పది మంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇస్తాం'' అన్నారు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి.

అంతా మంచే జరుగుతుంది

- విష్ణు మంచు


● తేజ్, విష్ణు మంచు, రిషిక

''ఇండస్ట్రీలో ఓ యాక్టర్‌కి, మేకప్ మేన్‌కి ఉన్న బంధం భార్యాభర్తల్లాంటిది. నేను చిన్నప్పటి నుంచి మేకప్‌మేన్ చంద్రగారిని చూస్తున్నాను. ఓ రైటర్‌గా, డైరెక్టర్‌గా, నిర్మాతగా సినిమా చేయటం అంత సులభం కాదు.. ఆయన మంచి మనసుకి అంతా మంచే జరుగుతుంది. 'మాధవే మధుసూదనా' సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో విష్ణు మంచు అన్నారు. తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా రూపొందుతోన్న చిత్రం 'మాధవే మధుసూదనా'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను విష్ణు మంచు రిలీజ్ చేశారు. బొమ్మదేవర రామచంద్ర రావు మాట్లాడుతూ–'' నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన అన్నపూర్ణ స్టూడియో సంస్థకు, నాగార్జునగారికి రుణపడి ఉంటాను. మోహన్ బాబుగారు సింగపూర్‌లో ఉండటం వల్ల ఆయన స్థానంలో విష్ణుని పంపించినందుకు కృతజ్ఞతలు'' అన్నారు.

రీల్స్

డబుల్ ఇస్మార్ట్‌లో..


● సంజయ్ దత్

తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారట బాలీవుడ్ నటుడు సంజయ్ దత్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని ఓ కీలక పాత్రకు సంజయ్ దత్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఈ చిత్రంలో భాగం కావడానికి సంజయ్ దత్ సుముఖంగా ఉన్నారని టాక్.

కేరాఫ్ దెయ్యం...


● రవిబాబు


ఒకప్పుడు గ్రామాల్లో మాతంగులుగా జీవించిన వారిలో ఒక స్త్రీ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'భయం.. కేరాఫ్ దెయ్యం'. మాతంగిగా రమ్య, మాంత్రికుడిగా నటుడు–దర్శకుడు రవిబాబు, తాంత్రికుడిగా నటుడు సత్యప్రకాష్ ముఖ్య పాత్రలు చేశారు. సీవీఎస్ఎం వెంకట రవీందర్ నాథ్ దర్శకత్వంలో పెదారికట్ల చేనెబోయిన్న నరసమ్మ, వెంకటేశ్వర్లు నిర్మించారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలు జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇటీవల జరిపిన రెండో షెడ్యూల్‌లో రవిబాబుపై సీన్స్ తీశాం. కన్నడ, తెలుగు భాషల్లో నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో తెలియజేస్తాం'' అని దర్శక–నిర్మాతలు అన్నారు.

రోడ్స్ బ్లాకు...


● శివానీ, శ్రీ కమల్

'ఆకు పాకు ఇస్తరాకు.. ఆల్ సైడ్స్ రోడ్స్ బ్లాకు..' అంటూ సాగే పాట 'జిలేబి' చిత్రంలోనిది. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి', 'మన్మథుడు' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు కె. విజయ భాస్కర్ కొంత గ్యాప్ తర్వాత తెరకెక్కించిన చిత్రం ఇది. శ్రీ కమల్, శివానీ రాజశేఖర్ జంటగా గుంటూరు రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమాలోని 'ఆకు పాకు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు.

ఓ ప్రేమకథ


● మోక్ష, వికాస్ వశిష్ట, కుషిత

వికాస్ వశిష్ట, మోక్ష, కుషిత కళ్లపు హీరో హీరోయిన్లుగా అంజిరామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీతోనే నేను'. ఈ సినిమా టైటిల్, పోస్టర్‌ను చిత్ర నిర్మాత ఎమ్. సుధాకర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. ''చదువుకునే టైమ్‌లోనే సినిమా తీయాలనే కల ఉండేది. మంచి టీమ్‌తో 'నీతోనే నేను' తీశాను'' అన్నారు ఎమ్. సుధాకర్ రెడ్డి. ''ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పని చేశారు'' అన్నారు అంజిరామ్. ''ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది'' అన్నారు వికాస్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నవీన్, కెమెరామేన్ మురళీ మోహన్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ బి. కడగండ్ల పాల్గొన్నారు.